తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

Published From: Medchal-Malkajgiri | సంపుటి: 5 సంచిక: 96 పేజీలు : 08 | మంగళవారం 31-3- 2026 వెల: 3 రూ/.

## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

### - గవర్నర్ ను కోరిన బీఆర్ఎస్ నేతలు

2లో..



## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

### - అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్



**హైదరాబాద్,:** సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..

2లో..

## ఆహార కల్తీ నియంత్రణ

# సరికొత్త వ్యవస్థ



- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో

2లో..

### నగదు లభ్యత పెంచేందుకు

## ఆర్బీఐ చర్యలు

### - బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.84 వేల కోట్లు ప్రవేశపెట్టిన ఆర్బీఐ




న్యూఢిల్లీ బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను (లిక్విడిటీ) పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) సోమవారం కీలక చర్యలు చేపట్టింది. రెండు వేరియబుల్ రేట్ రెపో (వీఆర్ఆర్) వేలాల ద్వారా మొత్తం రూ.84,582 కోట్లను వ్యవస్థలోకి చొప్పించింది. ఆర్థిక వ్యవస్థలో నిధుల ప్రవాహాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత వీఆర్ఆర్ వేలంలో రూ.50,001 కోట్లను 5.44 శాతం వెయిటెడ్ యావరేజ్ రేటుకు విడుదల చేసింది. ఆ తర్వాత నిర్వహించిన మరో వేలంలో రూ.34,581 కోట్లను 5.30 శాతం వెయిటెడ్ యావరేజ్ రేటుకు బ్యాంకులకు అందించింది. మొదటి వేలానికి మంచి స్పందన రాగా, రెండో వేలానికి అడిగిన మొత్తం కంటే

2లో..

## చర్చల ద్వారా

# సమస్యల పరిష్కారం

- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ :** చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్

2లో..

## సర్కారును నిలదీసిన రాములమ్మ

- ఉద్యమకారులు లేకుంటే సీఎంలు, మంత్రులు అయ్యేవారా
- కమిటీల పేరుతో కాలయాపన వద్దని రేవంత్‌కు సూచన
- మండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతి తమ సొంత ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అహర్నిషలు పోరాటం చేసిన ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె శాసనమండలిలో డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం పోరాటం చేసి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఆ కుటుంబాలకు నెలకు రూ.25 వేల చొప్పున పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చాలని

2లో..

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య

# రహస్య ఒప్పందం ఉంది

### - కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు



**అదూర్** కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) – కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్–బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు. పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం

2లో..



# లక్షల కోట్ల ప్రజాధనం వృథా

### - కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక విమర్శలు
### - ప్లానింగ్ లోపాలే కారణమని వెల్లడి

**హైదరాబాద్** రాజ్యసభలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై జరిగిన చర్చలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన వైఫల్యాలకు ప్రధాన కారణం ప్లానింగ్, డిజైన్ లోపాలేనని ఆయన స్పష్టం చేశారు. కేవలం సరైన ప్రణాళిక లేకపోవటం వల్ల లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ఆయన సభలో వెల్లడించారు. ఒక భారీ సాగునీటి ప్రాజెక్టును నిర్మించేటప్పుడు అనుసరించాల్సిన ప్రాథమిక సూత్రాలను విస్మించడం వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని కేంద్రం ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం ఈ లోపాలను, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తోందని పాటిల్ తెలిపారు. ఈ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రాజెక్టులో జరిగిన సాంకేతిక లోపాలు మరింత స్పష్టంగా బయటపడే అవకాశం ఉంది. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే కాకుండా రాష్ట్రంలో తాగు నీటి సరఫరాకు ఉద్దేశించిన జల్‌జీవన్ మిషన్ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. తెలంగాణ వద్ద ప్రస్తుతం జల్‌జీవన్ మిషన్ నిధులు 873 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కేవలం 194 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గత మూడేళ్లుగా జల్‌జీవన్ మిషన్ అమలుకు సంబంధించిన తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి ఒక్క ప్రతిపాదన కూడా అందలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అతి పెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. దీన్ని 2016–2019 మధ్య కాలంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టు ప్రధాన నిర్మాణం జరిగింది. గోదావరి నది జలాలను ఎత్తిపోసి, తెలంగాణలోని 13 జిల్లాల్లో సుమారు 18.25 లక్షల ఎకరాల కొత్త

2లో..

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు

### - బ్యాంకింగ్ నిబంధలనపై నిర్మలమ్మ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ** వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి

2లో..

# అణు దాడికి ఐరాసలోనే ప్లాన్

### - ఇరాన్‌పై అణుదాడికి సన్నాహాలు.? - ఐరాసలో పదవికి రాజీనామా చేసిన దౌత్యవేత్త



**న్యూఢిల్లీ** ఐక్యరాజ్యసమితి దౌత్యవేత్త మహమద్ సఫా తన పదవికి రాజీనామా చేస్తూ, సంచలన ఆరోపణలు చేశారు. ఇరాన్‌పై అణ్వాయుధాలు ప్రయోగించేందుకు ఐక్యరాజ్యసమితిలోని ఓ వర్గం మద్దతు ఇస్తోందని, ఈ మానవత్వ వ్యతిరేక నేరంలో తాను భాగస్వామిని కాలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో ఒక లేఖ ద్వారా ఆయన వెల్లడించారు. "ఇరాన్‌పై అణుదాడికి ఐక్యరాజ్యసమితి 'సహకారం' అందిస్తోందన్న విషయాన్ని ప్రజలు గ్రహించడం లేదు. టెహ్రాన్ ఒక ఖాళీ ఎడారి కాదు. అక్కడ కుటుంబాలు, పిల్లలు, కలలు కనే మనుషులు ఉన్నారు. యుద్ధం కోరుకునే వారు మానసికంగా అనారోగ్యంతో ఉన్నట్టే" అని సఫా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సుమారు కోటి మంది జనాభా ఉన్న టెహ్రాన్‌పై అణుదాడి చేస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని, వాషింగ్టన్, బెర్లిన్, లండన్ వంటి నగరాలపై ఇలాంటి దాడి జరిగితే పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ నిజాన్ని బయటపెట్టడం కోసమే తన దౌత్యపరమైన కెరీర్‌ను వదులుకున్నానని, ముప్పు ఏర్పడకముందే దీన్ని ఆపాలని ప్రపంచ ప్రజలకు పిలుపునిచ్చారు.మహమద్ సఫా 2016 నుంచి 'పేట్రియాటిక్ విజన్' (పీవీఏ) అనే అంతర్జాతీయ సంస్థకు ఐక్యరాజ్యసమితిలో

2లో..

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



## బ్రహ్మంగారుని దర్శించుకున్న బుల్లితెర నటులు



**బ్రహ్మంగారిమఠం** సోమవారం ఉదయం బుల్లితెర నటి నటులు జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సజీవ సమాధి దర్శనం చేసుకున్నారు. అనంతరం మఠాధిపతులు పూజ్యశ్రీ శ్రీ శ్రీ వీర భర్మజ వేంకటాద్రి స్వాములవారిని దర్శించుకుని స్వామివారి దివ్య ఆశీస్సులు తీసుకున్నారు. బుల్లితెర మీద నటించిన నటీనటులలో కుంకుమ పువ్వు సీరియల్ హీరోయిన్ ప్రిన్సీ కృష్ణన్ మరియు కార్తీక దీపం సీరియల్ కో డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి ఇతర క్యారెక్టర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి తమ్ముడు దత్తాత్రేయ స్వామి కూడా పాల్గొన్నారు.

## చల్లబసాయపల్లె లోనేడు రైతు సేవ కేంద్రం,

# హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం

**- మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ సంఘన హరినాధరెడ్డి**



**కడప** మండలంలోని చల్లబసాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవ కేంద్రం, హెల్త్ సెంటర్లను కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవింద్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు చల్లబసాయ పల్లె మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ సంఘన హరినాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని చల్లబసాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవకేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ నూతన భవనం లను మంగళవారం ఎంపీ, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఉదయం 8.5గంటలకు ప్రారంభోత్సవం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున సంబంధిత అధికారులు మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని హరినాథరెడ్డి తెలిపారు .

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా - ప్రజావాణి ఫిర్యాదులు 225**



**కరీంనగర్** ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్ డి ఆర్ డి ఓ శ్రీధర్ గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసు పలు అధికారులు పాల్గొన్నారు.

## అన్నదానానికి నగదు అందజేత....



**మైలవరం :** మండలంలోని చీమలపాడు గ్రామంలో శ్రీ దాసాంజనేయ స్వామి గుడి వద్ద శ్రీరామనవమి సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమానికి బొప్పన మహానాథ్ (ఎన్ఆర్ఐ) 20,000 నగదు అందించారు. ఈ నగదును విజయవాడ ఏడిసిపి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా గ్రామ పెద్దలు మరియు గుడి కమిటీ సభ్యులకు అందించారు. ఈ గ్రామంలో నిరుపేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న బొప్పన మహానాథ్ (ఎన్ఆర్ఐ) కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గద్దె కృష్ణారెడ్డి, విజయవాడ మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున్ యాదవ్, పర్వ జమలయ్య, పామర్తి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మొర్ల తిరుపతిరావు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట రామాలయంలో పూజలు

# చేయడం సంతోషంగా భావిస్తున్నా...

**- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**

**కడప** రాముని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం.. ఒంటిమిట్ట కోదండ రామస్వామి రామాలయంలో పూజలు చేయడం సంతోషంగా భావిస్తున్నానని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం అయినా ఒంటిమిట్టకు వచ్చిన సందర్భంగా సీతారాముల సమేత లక్ష్మణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సాగర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యుడు అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఒకటవ తేదీ జరిగే కళ్యాణ వేడుకకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది..టీటీడీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాల న్నారు..ఎంతో ప్రసిద్ధిగాంచిన ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ లో ప్రతి రైలు ఆపేలా చర్యలు తీసుకోవాల నీ ఆయన డిమాండ్ చేశారు ..ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖ మంత్రిని పలుమార్లు కలిసి వినతిపత్రం అందించా నన్నారు..బ్రహ్మోత్సవాల సమయంలోనే కాకుండా మిగతా అన్ని రోజులు ఒంటిమిట్ట రైల్వే స్టేషన్లో ప్రతి రైలుకు స్టాపింగ్ కల్పించా లన్నారు. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ఒంటిమిట్ట కేంద్రంగా నియోజకవర్గ ఏర్పాటయితే బాగుంటుంద నీ..ఒంటిమిట్టకు ఉన్న చరిత్ర నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గ ఏర్పాటుకు ఆలోచించాల నీ పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవి నాష్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ వెంట రాజంపేట ఎమ్మెల్యే ఆర్కేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్ ఇతర నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలో టీటీడీ ఆలయాల వైభవాన్ని తెలియజేసే ఫోటో ప్రదర్శన



**కడప** ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయాల సమగ్ర సమాచారాన్ని భక్తులకు టీటీడీ అందుబాటులో ఉంచింది. ఒంటిమిట్టలోని పీఏసీకి ఎదురుగా టీటీడీ సమాచార విభాగం ఆధ్వర్యంలో ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయ చరిత్ర, ఆలయంలోని అద్భుత శిల్పకళా వైభవం, శిల్ప సంపదకు సంబంధించిన చిత్రాలను ప్రదర్శించారు. అలాగే జాంబవంతుడు, తాళ్లపాక అన్నమాచార్య విగ్రహాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా భక్తులకు అందుబాటులో ఉంచారు.అదేవిధంగా దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, నందలూరు సౌమ్యనాథస్వామి దేవాలయం, జమ్మలమడుగు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వంటి ఆలయాలతో దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాల వివరాలను కూడా ప్రదర్శనలో పొందుపరిచారు.ప్రతి ఆలయానికి సంబంధించిన చరిత్ర, స్థాపన నేపథ్యం, ప్రత్యేకతలు, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో పాటు ఆయా ఆలయాలకు చేరుకునే మార్గాల వివరాలను సవివరంగా తెలియజేశారు. ఈ సమాచారం భక్తులకు భవిష్యత్తులో ఆలయ దర్శనాలకు ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఈ ప్రదర్శనను తిలకించి టీటీడీ ఆలయాల చరిత్ర, వైభవం, విశిష్టతలను తెలుసుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని టీటీడీ కోరుతోంది.

# అణు దాడికి ఐరాసలోనే ప్లాన్

ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఈ సంస్థకు ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలిలో ప్రత్యేక సలహా హోదా ఉంది. 2013 నుంచి ఆయన పీపీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా కూడా ఉన్నారు. గత మూడేళ్లుగా తాను ఎంతో ఓపిక పట్టానని, 2023లోనే రాజీనామా చేయాలని భావించినట్లు సఫా చెప్పారు. 2023 అక్టోబర్లో హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తర్వాత తన అభిప్రాయాల కారణంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌ను విమర్శించడానికి ఐక్యరాజ్యసమితిలోని కొందరు సీనియర్ అధికారులు ఇష్టపడటం లేదని ఆయన ఆరోపించారు. ఒక 'శక్తివంతమైన లాబీ' కొత్త ప్రపంచ వ్యవస్థను సృష్టించిందని, దానికి కొందరు ఐక్యరాజ్యసమితి అధికారులు 'సేవ' చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాల తర్వాత తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మరణ బెదిరింపులు వచ్చాయని సఫా వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలో నేరుగా కాకపోయినా, సదరు లాబీకి 'సేవ' చేస్తున్న అధికారుల ద్వారా సెన్సార్‌షిప్‌ను ఎదుర్కొన్నట్లు ఆయన ఆరోపించారు. సఫా చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై ఐక్యరాజ్యసమితి ఇంకా స్పందించలేదు. మధ్యప్రాచ్యంలో ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## లక్షల కోట్ల ప్రజాధనం వృథా

ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు, మరో 18.82 లక్షల ఎకరాలకు పాత ఆయకట్టు స్థిరీకరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టుపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే మూడు ప్రధాన బ్యారేజీలు ఉన్నాయి. మొత్తం 15 రిజర్వాయర్లతో 140-148 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. 20 లిఫ్ట్ స్టేషన్లలో 82 భారీ పంపును అమర్చారు. 1531 కిలోమీటర్ల పొడవైన కాలువలు, 203 కిలోమీటర్ల మేర భూగర్భ సొరంగాలు నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రోజూ 2 టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు మొత్తం 180 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. ఇందులో సాగునీటికి 134.5 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 30టీఎంసీలు, హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 30 టీఎంసీలు, పరిశ్రమలకు 16 టీఎంసీలు కేటాయించారు. ప్రాజెక్టు ప్రారంభంలో అంచనా వ్యయం 80,500 కోట్లు ఉండగా, కాలక్రమేణా అది 1.47 లక్షల కోట్ల వరకు పెరిగిందని కాగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన భాగమైన మేడ గడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇది కేవలం నిర్మాణ లోపమే కాకుండా, మొత్తం ప్రాజెక్టు డిజైన్, ప్లానింగ్‌లోనే లోపాలు ఉన్నాయని కేంద్రంతోపాటు, రాష్ట్రం నియమించిన ఘోష్ కమిషన్ అభిప్రాయపడింది. ఘోష కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఈ కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసింది. ఇప్పుడు కేంద్రం వద్ద ఇది పెండింగ్‌లో ఉంది. ఇంతలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ చేసిన కామెంట్స్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి.

## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

**హైదరాబాద్** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలు ఉన్నాయని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం సోమవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. మంత్రికి సంబంధించిన అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మంత్రికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. జంట జలాశయాల పరిరక్షణ ప్రాంతాల్లో సైతం మైనింగ్ చేస్తోందని, దీనికి సంబంధించి కనీస అనుమతులు కూడా తీసుకోలేదని పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో వివరించింది. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే, తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారే తప్ప ప్రభుత్వం స్పందించలేదని నేతలు అన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వం సభలో అంగీకరించడమే అక్రమాలకు నిదర్శనమని వారు వెల్లడించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నందున సీఐడీ వంటి రాష్ట్ర ఏజెన్సీలపై తమకు నమ్మకం లేదన్నారు. పొంగులేటి మంత్రిగా కొనసాగితే విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి ఆయన్ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు.

## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు. ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకువేస్తున్నామని తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.

## ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

## నగదు లభ్యత పెంచేందుకు ఆర్బీఐ చర్యలు

తక్కువ బిడ్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో మార్చి 27 నాటికి సుమారు రూ.1.27 లక్షల కోట్ల మిగులు నిధులు ఉన్నాయని అంచనా. గత కొన్ని రోజులుగా వీఆర్ఆర్ వేలాల ద్వారా ఆర్బీఐ రూ.2,73,530 కోట్ల తాత్కాలిక ద్రవ్య లభ్యతను కల్పించింది. అంతకుముందు, 2026 జనవరి నుంచి ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల (ఓఎంఓ) ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి రూ.3.50 లక్షల కోట్ల శాశ్వత ద్రవ్య లభ్యతను పెంచింది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్) చేపట్టనున్న రుణ సేకరణ వివరాలను ప్రకటించింది. ఆర్బీఐతో సంప్రదింపుల తర్వాత తొలి ఆరు నెలల్లో రూ.8.20 లక్షల కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ఈ రుణాలను డేటెడ్ సెక్యూరిటీలు, సావరిన్ గ్రీన్ బాండ్ల జారీ ద్వారా సేకరించనుంది.

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది

వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

## సర్కారును నిలదీసిన రాములమ్మ

సూచించారు. తెలంగాణ ఉద్యమకారులపై రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సందర్భంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని అదే విధంగా ప్రభుత్వ గుర్తింపు కార్డు కూడా ఇస్తామని తమ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన విజయశాంతి అధికారంలోకి వచ్చి 2 ఏళ్లు పూర్తి అయిపోయినా. తెలంగాణ ఉద్యమకారులకు మాత్రం ఇంకా న్యాయం జరగలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఇప్పుడు ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్న ఎమ్మెల్సీ విజయశాంతి వారికి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే ప్రస్తుతం తెలంగాణలో సీఎంలు గానీ, మంత్రులు గానీ ఉండేవారా అని విజయశాంతి నిలదీశారు.

పదవుల కంటే ముందు ఉద్యమకారులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన తప్పనిసరి బాధ్యత అని విజయశాంతి గుర్తు చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ సర్కార్ సరిగ్గా నిర్వర్తిస్తేనే అది చరిత్రగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలా కాకుండా ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తే మాత్రం అది పెద్ద చారిత్రక తప్పిదంగా చరిత్రలో మిగిలిపోతుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవంతోపాటు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందని విజయశాంతి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సున్నితమైన హెచ్చరికలు చేశారు.


## లాకర్లలోని వస్తువులను

# బ్యాంకులు చూడవు

సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

## ఐదు రూపాయల భోజనం పథకం,ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి - సీఐటీయూ




మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల యూనియన్
CWFI - CITU అనుబంధం :: రి.నెం. A/TU/DCL/RR/213/2025
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ
సిహెచ్. అశోక్ జిల్లా అధ్యక్షులు సెల్ : 9177747544
జి. వెంకన్న జిల్లా ప్రధాన కార్యదర్శి సెల్ : 9949891939
Date 30/03/2026
శ్రీయుత గౌరవనీయులైన శ్రీమతి ఎన్. వసంత గారు, డిప్యూటీ కమిషనర్, కీసర సర్కిల్-01, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC).
విషయం: జవహర్ నగర్ అంబేద్కర్ నగర్ అడ్డా వద్ద ఐదు రూపాయల భోజనాన్ని ఏర్పాటు చేయడం గురించి.
CHINTHAKINDI ASHOK (BCWU) MEDCHAL MALKAJGIRI DIST
BANGARU NARSING RAO SECRETARY KEESARA MANDAL CITU 8333910454
NAGESH JAWAHAR NAGAR CITU COMMITTEE

**కీసర, మార్చి 30,(అక్షర గళం) :**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ 01, జవహర్ నగర్ డివిజన్ 03, ప్రాంతంలో బాలాజీ నగర్ అడ్డా భవన నిర్మాణ, హమాలి కార్మికులకు ఐదు రూపాయల భోజనం (ఇందిరమ్మ క్యాంటీన్) ఏర్పాటు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చింతకింది అశోక్ తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... అడ్డా కార్మికులకు రోజువారి కూలీ దొరకడం గగనమైన పరిస్థితిలో కూలీలందరూ అర్ధకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్ ,బాలాజీ నగర్ అడ్డా ప్రాంతంలో సుమారు 300 మందికి పైగా కార్మికులు ఉపాధి కోసం అడ్డాల వద్ద పడిగాపులు పడుతున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వము ఇందిరమ్మ కాంటీన్ ఐదు రూపాయల భోజనం పథకాన్ని అడ్డాల వద్ద అమలు చేయాలన్నారు. దినికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ వీలైనంత తొందరలో ఐదు రూపాయల భోజనం పథకాన్ని ఇందిరమ్మ క్యాంటీన్ అందుబాటులో తీసుకురావడం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ్ రావు, సిఐటియు నాయకులు నగేష్, శివన్నారాయణ,కుమార్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



**వెల్దండ మార్చి 30 (అక్షర గళం)** పిడుగుపాటుకు గురై పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వెల్దండ మండల పరిధిలోని అజలాపూర్ గ్రామానికి చెందిన కేశమోని శ్రీశైలం అనే రైతు పాడి ఆవు సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ఒక్కసారిగా పిడుగు పడటంతో పాడి ఆవు మృతి చెందాయి. దీంతో 50వేల నష్టపరిహారం జరిగిందని ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



వెల్దండ మార్చి 30 (అక్షర గళం) పిడుగుపాటుకు గురై పాడి ఆవు మృతి చెందిన సంఘటన వెల్దండ మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వెల్దండ మండల పరిధిలోని గాన్ గట్టు తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఇసుక బోర్డ్ తండాకు చెందిన కేతావత్ పుణ్య నాయక్ అనే రైతు పాడి ఆవు సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ఒక్కసారిగా పిడుగు పడటంతో పాడి ఆవు మృతి చెందింది మృతి చెందిన ఆవు ఖరీదు 40 వేల నుండి 50 వేల ఉంటుందని రైతు అన్నారు ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## శ్రీ శ్రీ ముత్యాలమ్మ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



యాచారం, అక్షరగళం :- యాచారం మండల కేంద్రంలోని ఆదివారం శ్రీ శ్రీ ముత్యాలమ్మ ఆలయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భూతరాజు భీముడు, ప్రధాన కార్యదర్శిగా భూతరాజు రత్నగిరి ప్రసాద్, పలువురు సభ్యులతో కమిటీని ఎన్నుకొన్నారు. అనంతరం సంఘం పెద్దలు నూతన కమిటీకి నియామక పత్రం అందజేశారు. కుల సంఘం పెద్దలు, నూతన కమిటీ సహకారంతో ఆలయా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధ్యక్షులు భూతరాజు భీముడు తెలిపారు.



తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# తెలంగాణ రౌండప్

మంగళవారం - 31 మార్చి 2026 - పేజీలు

## అహ్మద్‌గూడలో పార్క్, చెరువు అభివృద్ధి చేయాలి

**- భద్రతా లోపాలు, కాలుష్యంపై నివాసితుల ఆందోళన - ఎంఎంసీ ప్రజావాణిలో కమిషనర్ కు వినతి**





**కీసర,మార్చి 30,(అక్షర గళం) :**మల్కాజ్గిరి మహానగర పాలక సంస్థ మల్కాజిగిరి జోన్ పరిధిలోని కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని అహ్మద్‌గూడ 2బిహెచ్‌కే కాలనీ నివాసితులు తమ ప్రాంతంలోని ప్రకృతి వనం పార్క్‌ను పబ్లిక్ పార్క్‌గా అభివృద్ధి చేయడంతో పాటు చెరువును పరిరక్షించాలని మల్కాజ్గిరి మహానగరపాలక సంస్థ అధికారులను సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో లబ్ధిదారులు సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి అధికారులను కోరారు.ప్రకృతి వనం పార్క్ ప్రస్తుతం సరైన సౌకర్యాలు లేక ప్రజలకు పూర్తిగా ఉపయోగపడడం లేదని నివాసితులు తెలిపారు. పిల్లలు, పెద్దలు వినియోగించుకునే విధంగా వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని కోరారు. 12, 13, 14, 15 బ్లాక్‌ల వద్ద ఆట పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ, భద్రత కోసం గ్రిల్, ఇసుక ఏర్పాటు చేయలేదని తెలిపారు. సమీపంలో ఉన్న సంప్, విద్యుత్ వైర్లు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ఇందిరమ్మ కాలనీ ఎదురుగా ఉన్న చెరువు నిర్లక్ష్యానికి గురై చెత్తతో కలుషితమవుతోందని పేర్కొన్నారు. చెరువు చుట్టూ చెత్త వేయడం, పూడిక పేరుకుపోవడం వల్ల భవిష్యత్తులో చెరువు నాశనం అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. చెరువును ఆక్రమణల నుంచి రక్షించడం, పూడిక తొలగించి శుభ్రపరచడం, చుట్టుపక్కల పరిశుభ్రత, పచ్చదనం కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని నివాసితులు విజ్ఞప్తి చేశారు.

## మహనీయులకు ఘనంగా 9వ వారం జ్ఞానమాల

**ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్,తెలంగాణ స్టూడెంట్ జేఏసీ చైర్మన్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఫౌండర్, మాదిగ జేఏసీ ఫౌండర్, ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి ఫౌండర్,మార్వాడో గో బ్యాక్ జేఏసీ ఫౌండర్ పిడమర్తి రవి**








**కీసర, మార్చి 30,(అక్షర గళం) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర - సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మహనీయులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 9వ వార జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్,తెలంగాణ స్టూడెంట్ జేఏసీ చైర్మన్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఫౌండర్, మాదిగ జేఏసీ ఫౌండర్, ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి ఫౌండర్, మార్వాడో గో బ్యాక్ జేఏసీ ఫౌండర్ పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంబేద్కర్ ఆలోచనా విధానం, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జ్ఞానమాల కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను అనుసరించి ఉన్నత విద్యను అభ్యసించి,ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జ్ఞానంతో ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.ప్రతి ఆదివారం నిర్వహించే ఈ జ్ఞానమాల కార్యక్రమంలో కాలనీ ప్రజలు కుటుంబ సభ్యులతో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతరాజు ముదిరాజ్,మాల మహానాడు జిల్లా కన్వీనర్ గుజ్జుక పరశురాం,మాజీ కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్, ఆర్ జి కె కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు రాములు,ఆర్ జి కె అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గొల్లూరి రాజు,మాల సంఘం గౌరవ అధ్యక్షులు తాడేపల్లి అబ్బులు, కోశాధికారి గాలి సురేష్,మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సానాది సాయిబాబ,కీసర అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు పులిపాక తిరుపతి, దమ్మాయిగూడ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోడ నరేష్,ఆర్ జి కె అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు జి సాయి రెడ్డి,డి.జ్యోతి, పాడుగుల రూపా చంద్రమౌళి,కార్యనిర్వాక అధ్యక్షుడు రంగయ్య,రామకృష్ణ, నాగరాజు, ఖాదిర్,బందెల స్వామి,పి ఎల్లయ్య, పి రాజు,బొల్లెం పాండు, ఎర్ర కృష్ణ, ఎస్. సంపత్, కె. రామ్ గోపాల్, డి.నాగేశ్వరావు,బి.గౌతమ్,బి. చంద్రశేఖర్, బి.రాంబాబు,పి.స్వాతి,వెంకటేష్, కన్నయ్య,చిన్న,జెల్ల నర్సింహా,నాము నాయక్, ఎన్ దేవేందర్, కుమార్,అంబేద్కర్ సంఘం సభ్యులు,మాల సంక్షేమ సంఘం సభ్యులు, డబుల్ బెడ్రూమ్ కాలనీ ప్రజలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్





**వెల్దండ మార్చి 30 (అక్షర గళం)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు వెల్దండ మండల కేంద్రానికి చెందిన మోత్కు పార్వతమ్మ కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో మంజూరు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు ముదిగొండ రమేష్ మారేపల్లి శ్రీను నాయకులు కొయ్యల పుల్లయ్య, తుంగ శ్రీను ,క్యాసరపు మల్లేష్, ఉడుత వెంకయ్య,జంగిలి ఆనంద్ , ఉడుత పరమేష్, డేవిడ్, మట్ట మల్లేష్ ,రాజు,లింగం పాల్గొన్నారు.

# పేటలో తృటిలో తప్పిన ప్రమాదం..

## – ఇంజనీరింగ్ కాలేజ్ బస్సును ఢీకొట్టిన ఇన్నోవా..

**చిలకలూరిపేట** మండల పరిధిలోని పసుమర్తిసమీపంలో నూతన జాతీయ రహదారిపై సోమవారం ఉదయం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సును ఒక ఇన్నోవా వాహనం బలంగా ఢీకొట్టింది. కళాశాల బస్సు ఎప్పటిలాగే ఇంకొల్లు నుండి నరసరావుపేట వైపు విద్యార్థులతో వెళ్తుండగా, పసుమర్తి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం నియంత్రణ కోల్పోయి బస్సును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నట్లుసమాచారం. ఈ ప్రమాదంలో బస్సు స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ, విద్యార్థులందరూ ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని కళాశాలయాజమాన్యం అధికారికంగా ధృవీకరించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన కాలేజీయాజమాన్యం, ఘటనా స్థలానికి మరో బస్సును పంపించి విద్యార్థులను సురక్షితంగా కళాశాలకు తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు మరియు ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎక్సావేటర్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్** పీవీ మార్గ్ లో సంజీవయ్య పార్క్ సమీపంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నూతనంగా చెరువుల పూడికతీత , కలుపు మొక్కల తొలగింపు కోసం తీసుకొచ్చిన అధునాతన ఎక్స్‌వేటర్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఇది చెరువు అడుగుభాగంలో పూడికతీత, డ్రెడ్జింగ్ పనులు, కట్టలను బలోపేతం చేయడం, నీటి కలుపు మొక్కల తొలగింపు , శిధిలాలు ఓ బురద తొలగింపు , పాత చెరువుల పునరుద్ధరణ చేస్తుంది కూకట్పల్లి నాలా, సరస్సులోని ఇతర ప్రదేశాలలో నీటి కలుపు మొక్కల తొలగింపు, డ్రెడ్జింగ్ మరియు పూడికతీత కు ఉపయోగిస్తారు. గణేశ విగ్రహ నిమజ్జనం, దుర్గా విగ్రహ నిమజ్జనం, బతుకమ్మ, ఛత్ పూజ మరియు ఇతర కార్యక్రమాల వంటి పండుగల సమయంలో సమర్థవంతమైన దీనిని వినియోగించవచ్చు. ప్రతి షిఫ్ట్కు ఒక నైపుణ్యం గల ఆపరేటర్, ఒక పాక్షిక నైపుణ్యం గల ఆపరేటర్ ప్రాతిపదికన సర్వీస్ ఇంజనీర్ను ఉంటారని అన్నారు.

# అతిసారతో పలువురు ఆసుపత్రుల పాలు

**పల్నాడు**పల్నాడు, ఈపూరు మండలం పోనుగోటివారిపాలెంలో అతిసార ప్రబలింది. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు 20 మందికి పైగా గ్రామస్తులు గురయ్యారు. వారం రోజులుగా వరుసగా అతిసార బారిన పడుతున్నారు. నరసరావుపేట, ముప్పాళ్ల ఆస్పత్రుల్లో అతిసార బాధితులకు చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో తాగునీటిని పరీక్షించి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్.

# యుద్ధం నష్టం 28 వేల కోట్లు...

**న్యూయార్క్,** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కేవలం వ్యూహాత్మకంగానే కాకుండా ఆర్థిక పరంగా కూడా భారీ నష్టాలను మిగుల్చుతున్నాయి. ప్రముఖ పత్రిక ది వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం కేవలం 21 రోజుల్లోనే అమెరికా సైనిక ఆస్తులకు 1.4 బిలియన్ నుండి 2.9 బిలియన్ డాలర్ల వరకు నష్టం సంభవించినట్లు అంచనా. ఈ ఘర్షణలో అత్యాధునిక యుద్ధ విమానాల నష్టం అమెరికాకు పెద్ద దెబ్బగా మారింది. ఒక ఘటనలో మిత్రదేశం కువైట్‌కు చెందిన విమానం పొరపాటున అమెరికాకు చెందిన ఈ-15ఇ జెట్‌లను కూల్చివేయడం గమనార్హం. అదేవిధంగా అత్యాధునిక ఈ-35ఎ లైట్నింగ్ ఎఎ కూడా అత్యవసర ల్యాండింగ్‌కు దిగాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. విమానాలకే కాకుండా ఇంధన సరఫరా వ్యవస్థ కూడా తీవ్రంగా దెబ్బతింది. ఐఅ-135 స్ట్రాటోట్యాంకర్‌లపై జరిగిన దాడుల్లో సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అదనంగా ఓఖ-9 రీపర్ డ్రోన్‌లు కూడా భారీగా నాశనమయ్యాయి. ఒక్కో డ్రోన్ విలువ మిలియన్ల డాలర్లలో ఉండటంతో ఈ నష్టం మరింత పెరిగింది. రాడార్ వ్యవస్థలు కూడా ఈ దాడుల ప్రభావాన్ని తప్పించుకోలేకపోయాయి. జోర్డాన్, ఖతార్ ప్రాంతాల్లో ఉన్న కీలక రక్షణ వ్యవస్థలు దెబ్బతినడంతో అమెరికా నిఘా సామర్థ్యంపై ప్రభావం పడింది. ఇదే సమయంలో సముద్రంలో కూడా సమస్యలు ఎదురయ్యాయి. యూఎస్ నేవీకి చెందిన యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ విమాన వాహక నౌకలో అగ్నిప్రమాదం సంభవించడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పెంటాగన్ అదనంగా 200 బిలియన్ డాలర్ల నిధులను కోరుతున్నట్లు సమాచారం. పూర్తి స్థాయి భూయుద్ధం ప్రారంభం కాకముందే ఈ స్థాయి నష్టం సంభవించడం ప్రపంచ భద్రతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.

# కుళ్ళిపోయిన స్థితిలో అస్తిపంజరం కనిపించడంతో కలకలం

**సత్తుపల్లి** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణం సింగరేణి క్వార్టర్స్ సమీపంలోని జామాయిల్ తోటలో గుర్తుతెలియని మృతదేహం కుళ్ళి అస్తిపంజరం లా కనిపించడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. జామాయిల్ తోటలో కుళ్ళిన స్థితిలో ఉన్న అస్తిపంజరాన్ని చూసిన స్థానికులు సమాచారాన్ని పోలీసులకు అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అస్తిపంజరాన్ని పరిశీలించారు సుమారు 20 రోజుల క్రితం మరణించి ఉంటాడని అది 20 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకుడి మృతదేహంగా భావిస్తున్నారు.. మృతదేహం పైభాగం మొత్తం ఎముకలు, పుర్రె కనపడుచుండగా కింద భాగంలో ఫ్యాంట్ మాత్రమే ఉండటంతో గుర్తించడం కష్టంగా మారింది. ఘటనా స్థలంలో పలు ఆధారాలను సేకరించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలానే పలు పోలీస్ స్టేషన్ లలో ఏమైనా మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయా అని ఆరా తీస్తున్నారు..మృతుడు ఎవరు.. హత్య లేక ఆత్మహత్య ...మృతి వెనుక కారణాలేమిటి..అన్న దానిపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్న పోలీసులు

# నరసరావుపేటలో విషాదం

## – ఆత్మహత్యాయత్నం చేసిన డాక్టర్ గోపి కన్నుమూత



నరసరావుపేట, పల్నాడు జిల్లా:స్థానిక దినేష్ లాడ్జిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డాక్టర్ గోపి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషాద ఘటన సోమవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో చోటుచేసుకుంది.

# గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

## – ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ

**మంచిర్యాల** చెన్నూరులోని సాంఘిక బాలికల గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న గంగారం గ్రామానికి చెందిన రాళ్లబండి రమేష్?చంద్రకళ దంపతుల కూతురు శ్రీవింధ్య(13) అనే బాలిక, ఈ నెల 25వ తేదీన వసతి గృహంలో పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, సిబ్బంది చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శ్రీవింధ్య మృతి చెందింది. అసలు పాఠశాలలోకి పాయిజన్ ఎలా వచ్చిందని ప్రశ్నించగా, 20 రోజుల ముందు విద్యార్థులందరూ బయటికి వెళ్ళారని, అప్పుడు కొని ఉంటుందని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. ఐసీయూలో ఉన్న బాలిక నుండి, సిబ్బంది తమకు అనుకూలంగా వాగ్మూలం తీసుకున్నారని బాలిక కుటుంబ సభ్యుల ఆరోపణ. పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండానే ఆసుపత్రికి తరలించడంపై అనుమానాలు ఉన్నాయని, తమ కూతురు సిబ్బంది వేధింపులు తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ బాలిక తల్లిదండ్రులు నిరసనకు దిగారు.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

## – జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి** ప్రజావాణి లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్, అశ్వరావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 911/33లో 5.00 గుంటల రిజిస్టర్ భూమి తన పేరున ఉన్నప్పటికీ, ఆర్ఎస్ఆర్ సమస్య కారణంగా పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదని తెలిపారు. తన పేరున పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూభారతి విభాగానికి ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఆంగోతు సంతులాల్, సర్వే నంబర్ 239/282లో వ్యవసాయ భూమి ఉన్నదని, గతంలో ఇంద్రజల ప్రభ పథకం కింద బోరు మరియు విద్యుత్ మంజూరు అయినప్పటికీ, మోటార్ మీటర్‌కు సర్వీస్ నంబర్ ఇవ్వలేదని తెలిపారు. తన విద్యుత్ కనెక్షన్ కొనసాగించేలా సర్వీస్ నంబర్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి విద్యుత్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఆళ్ళపల్లి మండలం చెలగట్టు గ్రామానికి చెందిన కొమరం సారమ్మ, తన భర్త మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పీజీ (ఎంఏ) వరకు చదువుకున్న తన కుమార్తెకు ఉపాధి కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మేదరబస్తీ 53వ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్, గత ఎనిమిదేళ్లుగా తమ ఇంటికి కిన్నెరసాని మంచినీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ నీటి బిల్లులు విధిస్తున్నారని తెలిపారు. నీటి బిల్లులను రద్దు చేసి కొత్త కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎండార్స్ చేశారు.

పినపాక, ఏడుళ్ల బయ్యారం, జానంపేట మరియు టి. కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు, రంజాన్ మరియు బక్రీద్ పర్వదినాలలో సామూహిక నమాజ్ నిర్వహించేందుకు తగిన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈద్గా స్థలం కేటాయించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి పినపాక తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రఘునాథపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహజ్వాల




**జనగామ** తమ నేత కడియం శ్రీహరి యెడల పాశవికంగా ప్రవర్తించి, అమానుషమైన రీతిలో అవమానించిన హుజూరాబాద్ ఎమ్మెల్లే పాడి కౌశిక్ రెడ్డిని బీఆరెస్ పార్టీ బహిష్కరించాలని, స్పీకర్ ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని గ్రంధాలయ సంస్థ జనగామ జిల్లా చైర్మన్ మార్జోడు రాంబాబు డిమాండ్ చేశారు. రఘునాథ్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించి పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతు తెలంగాణ అసెంబ్లీలో స్టేషన్ఘన్పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి మీద కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరిపోయేముందు అతిగావెలిగే దీపంలా మిడిసిపడడం కౌసిక్ రెడ్డి రాజకీయ పతనాన్ని సూచిస్తున్నదని ఆయన విమర్శించారు. దళితుల పట్ల దొరల అహంకారాన్ని ప్రదర్శిస్తూ, శాసనసభ సాక్షిగా విషం చిమ్మిన పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి తక్షణమే తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాసంపల్లి లింగాజి, గాదె మహేందర్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం పాష, నామాల బుచ్చయ్య, గొరిగ రవి, కావటీ భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడారి రవి, లోనే రవీందర్, సిద్ధేశ్వర్, తోటకూర రమేష్, బాసుమియా, పోకల శివకుమార్, బొమ్మ వీరస్వామి, అబ్రహం, వల్లాల అశోక్, దేగల రాజశేఖర్, ఈరీహ నాయక్, లోగుంట్ల క్రాంతి, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాకిటి చంద్రారెడ్డి, మోతిలాల్ , రామచందర్ కుంకీస్ ప్రకాష్ రెడ్డి, బాల్రెడ్డి జిల్లా నాయకులు, మండల నాయకులు, స ర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు , కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డ్రైవర్‌లకు కంటి చూపు ప్రధానం

## - ఎస్పీ నర్సింహా

## - కోదాడ పోలీస్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్ లకు ఉచిత కంటి పరీక్షలు



**కోదాడ** వాహన డ్రైవర్లకు కంటిచూపు ప్రధానమని, కంటిచూపు మందగింపుతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఎస్పీ కె నర్సింహా అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను



తగ్గించడం, డ్రైవర్ల కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వారి ప్రాణ భద్రతను కాపాడడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ శిబిరంలో సుమారు 500 మందికి పైగా ఆటో, లారీ డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్సై అంజిరెడ్డి, ఎస్సై సుధీర్, కంటి డాక్టర్లు అశోక్ కుమార్, మల్లీశ్వరి, రామ్ చరణ్, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్ గుట్టు రట్టు

## – స్మశాన వాటికలో సిలిండర్ల నిల్వ

**హైదరాబాద్** బ్లాక్ మార్కెట్ లో కమర్షియల్ సిలిండర్ అమ్ముతున్న ముఠా గుట్టును టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. పంజగుట్ట స్మశాన వాటికలో సిలిండర్ల తో నిల్వ చేసిన వైనం బయటపడింది. టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాత్ మాట్లాడుతూ బంజారాహిల్స్ పీఎస్ లో ఈ దందా కి పాల్పడుతున్న 10 మంది పైన కేసు నమోదు చేసామని వెల్లడించారు. గ్యాంగ్ నుండి 420 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ దందా కి మెట్రో హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం పాల్పడుతున్నట్లు గుర్తించారు. రెండు ఆటోలు ,రెండు బొలెరో,ఓమినీ ,రెండు డీసీఎం లు స్వాధీనం చేసుకున్నారు. 2100 వేల సిలిండర్లు 6 వేలకు అమ్ముతున్న వైనం గుర్తించారు. గ్యాస్ సప్లై లేదనే ప్రచారాన్ని నమ్మొద్దు.కావాలనే ఈ రూమర్ ని ప్రచారం చేస్తున్నారని అయన అన్నారు.

# మాజీ సర్పంచుల అసెంబ్లీ ముట్టడి..అరెస్టు

**హైదరాబాద్** చలో అసెంబ్లీ ముట్టడి బయలుదేరిన గాంధీభవన్ మార్గమధ్యలో మాజీ సర్పంచ్లను అరెస్టు చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముట్టడి చేపట్టారు. ట్టడం జరిగింది కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావలసిన గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు వచ్చిన గాని మాజీ సర్పంచులకు ఇవ్వడం లేదని మాజీ సర్పంచులు ఆరోపించారు. ముట్టడి కార్యక్రమములో భాగంగా అసెంబ్లీ వైపు వెళుతుండగా ఇంటలిజెన్స్ పోలీస్ సహకారముతో నయవంచక రేవంత్ ప్రభుత్వం పోలీస్ లు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 -24 వరకు గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 29 నెలలు అవుతున్న బిల్లులు చెల్లించడం లేదని అసెంబ్లీ సమావేశంలో మంత్రులు,ఓఎం లు మా సమస్యను పరిష్కరించాలి అని పెద్ద ఎత్తున బిల్లులు రావలసిన సర్పంచులు అసెంబ్లీ వద్దకు చేరుకొని నిరసన తెలపడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గ్రామపంచాయతీలకు మాజీ సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 15 ఆర్థిక సంఘం బిల్లులు చెల్లించడం లేదు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ాఈఅ నుండి పనిచేసిన బిల్లులు ాఆఈ స్టేట్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి పనిచేసిన బిల్లులు కొంతమంది సర్పంచుల మన ఊరు మనబడి బిల్లులు సంవత్సరాల తరబడి ప్రభుత్వం చెల్లిస్తాదని ఎదురు చూసి ఎదురుచూసిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. వడ్డీలకు అప్పులు తేవడం వల్ల విపరీతంగా వడ్డీలు పెరిగిపోయినాయి ఆర్థికంగా మాజీ సర్పంచుల కుటుంబాలు చిన్నాభిన్నభావుతున్నది. కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలు కూడా చేస్తున్నారు. కొంతమంది సర్పంచులు చాలా ఆర్థిక ఇబ్బందులతో కృంగిపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ మంత్రి సీతక్క మాజీ సర్పంచుల పెండింగ్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టి మాజీ సర్పంచుల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

# బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

## - ఏలూరు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హితబోధ చేశారు.

ఉంగుటూరు మండలం కైకరంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ సౌకర్యాలు, విద్యార్థుల విద్య అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో దోమల నియంత్రణ నెట్ లను ధ్వంసం చేసినట్లు గుర్తించి, వివరాలను వసతి గృహం వార్డెన్ ని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలోని విద్యార్థులే దోమల నియంత్రణ నెట్ లను ధ్వంసం చేసారని తెలియజేయడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వసతి గృహంలో దోమలు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు విషజ్వరాల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వసతి గృహంలోనూ దోమల నియంత్రణ నెట్ లను ఏర్పాటుచేసిందన్నారు.

# ఇచ్ఛాపురంలో హోటళ్లు బంద్

**ఇచ్ఛాపురం** శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురంలో గ్యాస్ కొరత వలన రేపు హోటల్లు బంద్ ప్రకటించినట్లుగా జిల్లా హోటల్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ నాగరాజు తెలిపారు. ప్రస్తుతం దేశం మొత్తం గ్యాస్ కొరతతో హోటల్స్ వ్యాపారస్తులు హోటల్స్ మూసేస్తున్న తరుణంలో ఇచ్ఛాపురంలో మాత్రం గ్యాస్ పక్కరాష్ట్రం ఒడిశాకు తరలిస్తున్నారని ఆరోపించారు. హోటల్స్ సప్లై చెయ్యాల్సిన గ్యాస్ ను పక్కదారి పట్టిస్తున్న ాయిూః గ్యాస్ ఏజెన్సీ లైసెన్స్ రద్దు చెయ్యాలని లేని పక్షంలో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా హోటల్స్ బంద్ కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట

# శ్రీ కోదండరామస్వామి కళ్యాణం

**– అధికారులకు మంత్రి సవిత పిలుపు**

**ఒంటిమిట్ట / తిరుపతి,** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఒంటిమిట్టలోని టీటీడీ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం ఆమె జిల్లా మరియు టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవం సందర్భంగా సమర్పించే పట్టు వస్త్రాల కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఏర్పాట్ల వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ, జిల్లా మరియు పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్, సభ్యులు బాధ్యతల స్వీకరణ

**– చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారాయణ రాజు**

**– ఆరుగురు సభ్యుల ప్రమాణ స్వీకారం**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నూతన చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారాయణ రాజు, సభ్యులుగా కే.జీ వెంకట పద్మలత, డా. ధోని శ్రీనివాస్ మూర్తి, ఉండవల్లి గాంధీ బాబు, చల్ల మధుసూదన రావు, మండల గంగ సూర్యనారాయణ, పి.నాగ మానస సోమవారం రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సెక్రటరీ ఉమాదేవి సమక్షంలో నూతన చైర్ పర్సన్, సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెక్రటరీ, సిబ్బంది నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పనిచేస్తామని తెలిపారు. సభ్యులు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్‌ని నిలుపుతామన్నారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే తక్షణమే కమిషన్ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను చైర్ పర్సన్, సభ్యులు కోరారు.

## మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

**– రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని లాబరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించి, పరీక్షలు నాణ్యతగా నిర్వహించాలని సూచించారు. అలాగే మందుల గిడ్డంగిని తనిఖీ చేసి, అవసరమైన అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. రక్త పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షల వివరాలు, అందుబాటులో ఉన్న టీకాల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవల స్థితిగతులు, అవసరమైన ఔషధాల లభ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుక్క కాటుకు గురైన ఒక బాలుడిని పరామర్శించి, అతనికి అందిస్తున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీ లో మెడికల్ ఆఫీసర్

# తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేది టిడిపి



**నందికొట్కూరు** నందమూరి తారకరామారావు 1982 మార్చి 29న స్థాపించిన రాజకీయ పార్టీ తెలుగుదేశం 9 నెలల స్వల్ప వ్యవధిలోని అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించింది. ఆ విధంగా 44 సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది దీని పురస్కరించుకొని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం, బ్రాహ్మణ కొట్కూరు గ్రామ బస్టాండ్ సమీపంలో తెలుగుదేశం పార్టీ జెండాను సింగిల్ విండో చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ్ రెడ్డి ఎగురవేశారు. ఆయనతోపాటు తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీటీసీ మొల్ల ఖాజా మొహిద్దిన్, లాడెన్, బిజ్జుల రాఘవేంద్ర రెడ్డి, నాగ తేజశ్వర్ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి ,మందడి నాగేశ్వర్ రెడ్డి, జయాకర్, అల్లా బకాష్ మరియు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఏర్పాటు తర్వాత ఎన్టీఆర్ చైతన్య రథం పై ప్రజల వద్దకు వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా పగలు రాత్రి అనే తేడా లేకుండా 36వేల కిలోమీటర్లు ప్రయాణం చేశారు. అదిలాబాద్ నుంచి అనంతపురం వరకు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం వెళ్లి ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. వారిలో భరోసానింపారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే తన పార్టీ మూల సిద్ధాంతం అని స్పష్టం చేశారు. ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయం తెలుగుదేశం పిలుస్తుంది రా కదలిరా అంటూ ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపు రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించింది. వయసుతో నిమిత్తం లేకుండా యువత మహిళలు వృద్ధులు ప్రతి ఒక్కరూ చైతన్య రథం వెంట పరుగులు తీశారు. విన్నత్న ప్రచార శైలి ఉన్నతమైన సిద్ధాంతాలు సామాన్యులు బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన రాజకీయ భాగస్వామ్యం ఉవ్వెత్తున లేచిన తెలుగువారి ఆత్మ గౌరవ భావుట అన్నిటికి మించి ఎన్టీఆర్ నిబద్ధత ఇలా అనేక అంశాలు కలిసి రావడంతో ఎన్నికల్లో తెలుగుదేశం ఘనవిజయం సాధించి, తొలి రోజు నుంచి నేటి వరకు సంక్షేమం అభివృద్ధి పరిపాలన రంగాల్లో పార్టీ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎన్టీఆర్ నేతృత్వంలో దాదాపు 7 సంవత్సరాలు చంద్రబాబు నాయుడు సారథ్యంలో 9 సంవత్సరాలు అధికారంలో కొనసాగిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రయోజనాలు ఎక్కడ రాజీ పడకుండా పరిపాలన సాగించింది. ప్రాంతీయ పార్టీ అయినా రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజకీయాలను సైతం శాసించే స్థానానికి చేరుకుంది. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్లో 2014-19 మధ్య ఐదేళ్లు తిరిగి 2024 నుంచి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో వడివడిగా ముందుకు తీసుకు వెళుతున్న తెలుగుదేశం పార్టీ అన్ని విధాల ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. ఈ నాలుగున్నర దశాబ్దాల ప్రస్థానంలో తెలుగుదేశం తన మూల సిద్ధాంతంలో ఎటువంటి మార్పు లేకుండా ఎన్టీఆర్ ఆశయాలు చంద్రబాబు విధానాలను కొనసాగిస్తూ నేడు 3.0 అధ్యాయంలోకి ప్రవేశించింది. యువ నేత నారా లోకేష్ ఆధునిక ఆలోచనలకు అనుగుణంగా మరింత వినూత్నంగా ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన తెలుగుదేశం కార్యకర్తలు మాండ్ర శివానందరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలతో హోరెత్తించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

# ప్రభుత్వ వైద్య విద్యార్థుల పరిశోధనలు, క్రీడలకు ప్రోత్సాహం!

- అల్లోపతితోపాటు ఆయుష్, డెంటల్, ఫిజియోథెరపీ, అలైడ్ సైన్సెస్ కోర్సులకు కూడా వర్తింపు
- విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫ్యాకల్టీకి రీసెర్చ్ గ్రాంట్ పెంపు
- వర్సిటీ కేంద్రంగా ఏఐ బేస్డ్ డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ సెంటర్ ఏర్పాటు
- ఈ-రీసోర్స్ ద్వారా 24 గంటలపాటు విద్యార్థులకు పరిశోధన సమాచారం
- పూర్వ వైద్య విద్యార్థుల అసోసియేషన్లను ఒకే తాటిపై తెచ్చేందుకు కృషి
- వైద్య విద్యలో ప్రమాణాల పెంపు కోసం అభివృద్ధికి మరికొన్ని వినూత్న కార్యక్రమాలు
- వర్సిటీ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడి

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిశోధనలు, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నామని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పుల్లల చంద్రశేఖర్ వెల్లడించారు. వైద్య విద్యలో ప్రమాణాల పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీసుకుంటున్న చర్యలకు కొనసాగింపుగా విశ్వవిద్యాలయం తరపున కూడా కొత్త నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు వైద్య విద్య ప్రమాణాల పెంపుతోపాటు వ్యాధుల నిరోధ చర్యల్లో కూడా విశ్వవిద్యాలయం భాగస్వామ్యం కాబోతుందన్నారు ఇందులో భాగంగా ఏఐ బేస్డ్ డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ సెంటర్ను కూడా ఏర్పాటుచేస్తున్నామని వెల్లడించారు విజయవాడలోని విశ్వవిద్యాలయంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

"ఈ నెల 17వ తేదీ విశ్వవిద్యాలయంలో జరిగిన 244వ పాలకవర్గ సమావేశం వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ అధ్యక్షతన జరిగింది. కేవలం అల్లోపతి వైద్యంలో మాత్రమే కాకుండా ఆయుష్ డెంటల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, ఎలైడ్ సైన్సెస్ (పారా మెడికల్), ఇతర వైద్య కోర్సుల్లో చదివే విద్యార్థులు, బోధకులు (ఫ్యాకల్టీ) పరిశోధనలవైపు దృష్టిపెట్టేలా, క్రీడలను ప్రోత్సహించేలా, పూర్వ వైద్య విద్యార్థుల సహకారాన్ని పొందేందుకు వీలుగా నిర్ణయాలు జరిగాయి. వీటిని కార్యాచరణలోనికి తెచ్చేందుకు ఏటా రూ. 22.13 కోట్ల వరకు వ్యయమవుతుంది. తాజాగా తీసుకున్న నిర్ణయాలు మూడేళ్లపాలు కొనసాగుతాయి. తదుపరి మరోమారు పునఃపరిశీలన చేసి, నాటి అవసరాలకు తగ్గట్లు చర్యలు తీసుకుంటారు" అని ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. విలేకర్ల సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయిసుధీర్, వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంటు డైరెక్టర్ డాక్టర్ ఎం. లక్ష్మీసూర్యప్రభ, సి ఓ ఈ శ్రీకాంత్‌పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు.



**వనపర్తి జిల్లా న్యూస్...**అర్జీలను వేగంగా పరిష్కరించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ అదర్స్ సురభి ఆదేశించారు.. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రసంగిస్తూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 35 దరఖాస్తులు వచ్చాయని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నరు. ముఖ్యమంత్రి. జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు చిత్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. వనపర్తి జిల్లా అదునపు (స్థానిక సంస్థల) కలెక్టర్ కిమ్యా నాయక్. వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్. వనపర్తి ఆర్టీవో డి. సుబ్రహ్మణ్యం. వనపర్తి జిల్లా జెడ్పీ సీఈఓ యాదయ్య. వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

### నవనీత కృష్ణుడిగా అలరించిన

# ఒంటిమిట్ట రామయ్య

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం స్వామివారు నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. మార్గమంతా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం బాలకృష్ణుడు వెన్నదొంగగా ప్రసిద్ధి. యశోదమ్మ ఇంట్లోనే కాక రేపల్లెలోని ప్రతి ఇంటికీ వెళ్లి వెన్నను ఆరగించేవాడని కథలు చెబుతాయి. ఈ బాలకృష్ణుడి లీలలను స్మరింపజేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా ఏపీ

**విజయవాడ,** మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణ రావు సహా తొమ్మిది మంది ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నక్సల్స్ రహిత రాష్ట్రంగా మారిందని డీజీపీ ప్రకటించింది. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధ డంప్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీలో అత్యంత కీలక నేత, ఏవోబీ ) స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి చెల్లూరి నారాయణరావు అలియాస్ సోమన్న పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు పలువురు డివిజినల్, ఏరియా కమిటీ సభ్యులు కూడా జనజీవన స్రవంతిలో కలిసినట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. ఈ సందర్భంగా వారి నుంచి భారీ ఆయుధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాలకు కూడా చేరుతుండటం, ప్రస్తుతం పరిస్థితుల్లో చాలా మార్పు రావడంతో ఉద్యమ ఉనికి తగ్గుతోందని, అందుకే సాయుధ పోరాటాన్ని వీడి లొంగిపోయినట్లు సోమన్న వివరించారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన నారాయణరావు దాదాపు 35 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. 1989లో పీపుల్స్ వార్ గ్రూప్‌లో చేరిన ఆయన, క్రమంగా పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ మిలిటరీ ఆపరేషన్లలో ఆరితేరిన నేతగా గుర్తింపు పొందాడు. గత ఏడాది అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక నేతలు గాజర్ల రవి, అరుణ మరణించిన తర్వాత, ఏవోబీ బాధ్యతల్ని సోమన్న చేపట్టారు. ఆయనపై ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశాలో పలు కేసులు నమోదయ్యాయి. ఏపీ ప్రభుత్వం భారీ రివార్డును కూడా ప్రకటించింది. ఉద్దానం ప్రాంతం నుంచి వచ్చిన సోమన్న లొంగుబాటుతో మావోయిస్టు పార్టీకి పెద్ద దిక్కు కోల్పోయినట్లయింది. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు పరిస్థితులు మారాయని, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు వెళ్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. సాయుధ పోరాటం ద్వారా సాధించేదేమీ లేదని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లొంగుబాటు ఏవోబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు గట్టి విఘాతంగా మారుతుందని భద్రతా దళాలు భావిస్తున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

## ప్రజలు ఇచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపండి

**పుట్టపర్తి :30** ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి లో నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీల ద్వారా అధికారులకు అందిన వెంటనే తక్షణం వాటికి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నియోజవర్గ అధికారులకు సూచించారు. అర్జీలు ఇచ్చిన వాటిని గాలికి పడేయకుండా సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని తక్షణం పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అలాంటి అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి రాకుండా స్థానిక పంచాయతీ అధికారులు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి పరిష్కారం చూపాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి కి ఇబ్బంది లేకుండా గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత రాజధానంట.. మమ్మల్ని తరిమేస్తారంట..

**విశాఖపట్టణం,** రాజధాని అమరావతి విషయంలో వైఎస్సార్సీపీ మరోసారి చర్చకు తెరతీసింది. ఆ పార్టీలోని సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు.. అమరావతిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అప్పులు తెచ్చి రాజధానిని అభివృద్ధి చేస్తున్నరన్నారని మిగతా ప్రాంతాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అమరావతిని శాశ్వత రాజధాని అంటూ తీర్మానం చేయడంపైనా అభ్యంతరం తెలిపారు. అమరావతిని శాశ్వత రాజధాని అని తీర్మానం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. 65 ఏళ్ల పాట హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే.. అక్కడ నుంచి తరిమేస్తే.. ఇక్కడకు వచ్చిపడ్డామని.. రేపు అమరావతి వాళ్లు కూడా మమ్నల్ని తరిమేస్తే మేం ఎక్కడకు వెళ్లాలన్నారు. "శాశ్వత రాజధాని అనే విధానం రాజ్యాంగంలో లేదని.. ఇప్పుడు శాశ్వత రాజధాని అని తీర్మానం చేస్తే.. రేపు రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి నిర్ణయం తీసుకునే అవకాశం ఉండదా..?" అని ప్రశ్నించారు. అప్పులు తెచ్చి రాజధానిలో పెడుతున్నారని.. కనీసం వెయ్యికోట్లు శ్రీకాకుళానికి ఇచ్చారా అని ప్రశ్నించారు. ధర్మాన తన ప్రసంగంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై చాలా సెటైర్లు వేశారు. చిన్నవాడైనా జగన్ పరిపాలనను చూసి నేర్చుకోవాలన్నారు. అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో జగన్ అభివృద్ధి వికేంద్రీకరణ చేశారని.. ఆ స్ఫూర్తి చంద్రబాబుకు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోర్టులు, ప్రాజెక్టలు ఇచ్చారని ఇప్పుడు వాటిని పూర్తి చేయడం లేదన్నారు. రాజధాని అమరావతి విషయంలో వైఎస్సార్సీపీ తీవ్ర గందరగోళంలో ఉంది. అమరావతిని శాశ్వత రాజధానిగా చేసిన తీర్మానంపై అవునని కాదని చెప్పలేని అయోమయంలో పడింది. ఇవాళ శ్రీకాకుళంలో జరిగిన చలో మూలపేట కార్యక్రమంలో వైసీపీ నేతల వ్యాఖ్యలు దానినే ధృవీకరిస్తున్నాయి. ధర్మాన ప్రసాదరావు అమరావతిపై చాలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కూడా అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన తీర్మానం ఎందకూ పనికిరాదని కామెంట్ చేశారువైఎస్సార్సీపీ ఇవాళ 'చలో మూలపేట' పోర్టు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పోర్టును జగన్ మోహనరెడ్డి అన్ని అనుమతులు తెచ్చి.. నిధులు కేటాయిస్తే..కూటమి ప్రభుత్వం తామే శాంక్షన్ చేశామని చెప్పుకోవడాన్ని తప్పు పడతూ వైసీపీ కార్యక్రమం నిర్వహించింది. ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని దానిని త్వరగా పూర్తిచేయాలంటూ చలో మూలపేట కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అయితే పోర్టు వద్దకు వెళ్లడానికి అనుమతి నిరాకరించడంతో గ్రామం వద్ద వైసీపీ సభ నిర్వహించింది.

## మంచి జరగాలంటే

# మనుషులనే నమ్మాలి



'లెజెండ్'ఫేం శరవణన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లీడర్'. లెజెండ్ శరవణన్ స్పోర్ట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి ఆర్ఎస్ దురై సెంథిల్‌కుమార్ దర్శకుడు. పాయిల్ రాజ్‌పుత్ కథానాయిక. ఏప్రిల్ 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఈ ప్రపంచంలో ఏ సహాయం దేవుడు నేరుగా చేయడు.. మనుషుల మూలంగానే అన్ని మంచి పనులు జరుగుతాయి.. మనం వాళ్లనే నమ్మలి..' అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. హీరో పాత్ర దృక్పథాన్ని తెలియజేసేలా పూర్తి యాక్షన్ మోడ్‌లో ట్రైలర్ సాగింది. తండ్రీ, కూతురు ఎమోషనల్ సీన్స్ మనసును తాకేలా ఉన్నాయి. ఆండ్రియా, బాహుబలి ప్రభాకర్, వీటీవీ గణేష్, ఐశ్వర్య తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఎస్ వెంకటేశ్, సంగీతం: జిబ్రాన్ వైబోధ.

# 'కాసరగోడ్ ఎంబసీ' (జీ 5) సిరీస్ రివ్యూ!



మలయాళంలో రూపొందిన వెబ్ సిరీస్ 'కాసరగోడ్ ఎంబసీ'. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సిరీస్ కీ, అతీష్ నాయర్ దర్శకత్వం వహించాడు. కబీర్ దుహాన్ సింగ్ .. అబూ సలీమ్ .. గోవింద్ పాయ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, ఈ నెల 20వ తేదీ నుంచి 7 ఎపిసోడ్స్ గా 'జీ 5'లో మలయాళంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి, తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. మంగుళూరులో ఆసిఫ్ – చెమ్మ అనే ఇద్దరు టీనేజ్ కుర్రాళ్లు ఉంటారు. ఆసిఫ్ కి తండ్రి లేకపోవడం వలన, అతని ఆలనా పాలన మేనమామ రజాక్ చూసుకుంటాడు. అనాథ అయిన చెమ్మ, ఆసిఫ్ తో కలిసి పెరుగుతాడు. ఆసిఫ్ తో పాటు అతని మేనమామ షాపులో చెమ్మ పనిచేస్తూ ఉంటాడు. రజాక్ ఈ ఇద్దరితో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయిస్తూ, తక్కువ మొత్తం ఇస్తూ ఉంటాడు. తాము జైలుకు వెళ్లినా అతను పట్టించుకోకపోవడం వాళ్లను ఆలోచనలో పడేస్తుంది. ఆ సమయంలో వాళ్లను బెయిల్ పై రాయ్ థామస్ బయటికి తీసుకుని వస్తాడు. రాయ్ థామస్ ఎవరనేది అప్పుడే ఆసిఫ్ కీ .. చెమ్మకి తెలుస్తుంది. అతను వాళ్లచే నకిలీ పాస్ పోర్టులు .. స్టాంప్ పేపర్స్ .. తయారుచేయిస్తూ, ఆనందకరమైన జీవితాన్ని అనుభవంలోకి తీసుకొస్తాడు. ఈ కుర్రాళ్ల పనితీరు గురించి కాసరగోడ్ లోని దామోదరరావు ( కబీర్ దుహాన్ సింగ్)కి తెలుస్తుంది. అతను వాళ్లని రప్పించి ఆశ్రయమిస్తాడు. దేశం విడిచి పారిపోవానుకుంటున్న రాజకీయనాయకులకు .. తీవ్రవాదులకు నకిలీ పాస్ పోర్టులు తయారు చేయించడం అతని అక్రమ వ్యాపారాలలో ఒకటి. దామోదరరావును అందరూ 'దాము' అని పిలుస్తుంటారు. అతని ప్రధానమైన అనుచరులుగా 'పింటో' – 'రాజా' ఉంటారు. విమాన ప్రమాదం వలన బయటపడిన ఉగ్రవాదులను వెతుకుతూ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ (దీపక్ పరంబోల్) కాసరగోడ్ చేరుకుంటాడు. అక్కడ ఏం జరుగుతుంది? ఆసిఫ్ – చెమ్మ జీవితాలు ఎలాంటి మలుపు తిరుగుతాయి? అనేక అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న 'దాము' పట్టుబడతాడా? అనేది మిగతా కథ.

'కాసరగోడ్' ను ప్రధానమైన కేంద్రంగా చేసుకుని, నకిలీ పాస్ పోర్టులు ఎలా తయారవుతున్నాయనే అంశం చుట్టూ అల్లుకుంటూ వెళ్లిన కథ ఇది. ఇక్కడి నుంచి చైల్డ్ ట్రాఫికింగ్ .. అక్రమ ఆయుధాల రవాణా జరుగుతున్నాయనేది డైలాగ్స్ పరంగానే చెప్పించారు. నకిలీ పాస్ పోర్టులు తయారు చేయడం అనే అంశాన్నే ప్రధానంగా తీసుకున్నారు. కథ అంతా కూడా ఈ విషయం చుట్టూనే తిరుగుతుంది. నకిలీ పాస్ పోర్టులకు సంబంధించిన వ్యవహారం ఎలా జరుగుతుంది? ఎక్కడెక్కడి నుంచి ఎవరెవరితో ఎలాంటి లింకులు ఉంటాయి? ఈ మాఫియాలో ఆధిపత్య పోరు ఎలా ఉంటుంది? మాఫియా ముఠాలోకి అడుగుపెట్టిన వాళ్లలో ఎవరి జీవితాలు ఎక్కువగా బలి అవుతుంటాయి? ఇలాంటి ఒక మాఫియా గ్యాంగ్ ను కట్టడి చేయడానికి రంగంలోకి దిగిన పోలీస్ ఆఫీసర్లకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనే అంశాలను ఆవిష్కరిస్తూ వెళ్లారు. చాలామంది కుర్రాళ్లకు టీనేజ్ లోకి అడుగుపెట్టేసరికి కుటుంబ బాధ్యతలు మీదపడుతుంటాయి. వాళ్లకి డబ్బు అవసరమవుతుంది. కుటుంబానికి అండగా నిలబడుతూనే వాళ్లు చిన్నచిన్న ఆనందాలను వెతుక్కోవడం జరుగుతూ ఉంటుంది. అలా తమకి తెలియకుండానే వాళ్లు మాఫియా ఉచ్చులో ఎలా చిక్కుంటారనేది ఈ కథలో ఎమోషన్స్ వైపు నుంచి నడుస్తుంది. ఒక వైపున రాజకీయ నాయకులు .. పోలీసులు .. లోకల్ రౌడీలు .. మాఫియా ముఠా నాయకులు .. ఇలా అన్ని వైపుల నుంచి దర్శకుడు ఈ కథను టచ్ చేస్తూ వెళ్లాడు. అయితే ఏ ట్రాక్ ను కూడా ఇంట్రెస్టింగ్ గా చెప్పలేకపోయారని అనిపిస్తుంది. టీనేజ్ కుర్రాళ్ల జీవితాలు .. వాళ్ల కలలు .. కష్టాలు .. కన్నీళ్లు ఇవేవీ మనసుకు హత్తుకునేలా చూపించలేకపోయారు. సాధారణంగా పోలీస్ ల ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన కంటెంట్ ను మలయాళ దర్శకులు చాలా ఆసక్తికరంగా ఆవిష్కరిస్తారు. కానీ ఈ సిరీస్ విషయంలో ఆడియన్స్ కి ఏమీ అనిపించదు. ఒక వైపు నుంచి పోలీస్ లు .. మరో వైపు నుంచి విలన్ హడావిడి చేస్తుంటారే తప్ప, అక్కడ ఏమీ ఉండదు. ఏదో జరగబోతుందనేట్టుగా బిల్డప్ లు ఉంటాయి .. కానీ ఎక్కడికక్కడ సన్నివేశాలు తేలిపోతూ ఉంటాయి. విలన్ గా కబీర్ దుహాన్ సింగ్ ను ఒక రేంజ్ లో చూపించారు. కానీ ఆయన పాత్రను పవర్ఫుల్ గా డిజైన్ చేయడకపోవడం వలన, పేలవంగా అనిపిస్తుంది. ఈ మాత్రం దానికి కబీర్ దుహాన్ సింగ్ అవసరమా? అని కూడా అనిపిస్తుంది. ప్రధానమైన కథాంశాన్ని బలంగా చెప్పలేకపోవడం .. చుట్టూ ఉన్న పాత్రలను ఆసక్తికరంగా ఆవిష్కరించలేకపోవడం మైనస్ గా అనిపిస్తుంది. రాజేశ్ రామన్ ఫొటోగ్రఫీ .. రతీష్ వేగ నేపథ్య సంగీతం .. జిలిన్ జోసెఫ్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. టీనేజ్ కుర్రాళ్లతో పాటు సీనియర్ ఆర్టిస్టులు తమ పాత్రల పరిధిలో నటించారు. కథాకథనాల పరంగా ఈ సిరీస్ చాలా వీక్ గా కనిపిస్తుంది. పాత్రను డిజైన్ చేసిన విధానం .. సన్నివేశాలను ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ప్రభావితం చేయలేకపోయింది. ఓ మాదిరి కంటెంట్ గా చెప్పుకోవచ్చు అంతే.




# ఇది నా రెండేళ్ల కష్టం

పాత్ర కోసం సర్వశక్తులూ ఒడ్డి శారీరకభాషను మార్చుకోవడం నేటి కథానాయకులకు పరిపాటైంది. 'బైకర్' సినిమాలో 18ఏండ్ల వయసున్న రేసర్‌గా శర్వానంద్ కొన్ని నిమిషాలు కనిపించాలి. దానికోసం తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నారు శర్వానంద్. 'ఉదయం సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం, లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన వ్యయామాలతో శరీరకంగానే కాదు, మనసికంగా కూడా బలంగా మారాను' అని శర్వానంద్ అన్నారు. ఈ ప్రయాణంలో విజయం సాధించేందుకు యోగా తనకు ఉపయోగపడిందని, దీంతో బరువు తగ్గి మరింత షార్ప్‌గా తయారయ్యానని శర్వా చెప్పారు. 'బలమైన నిర్ణయం ముందు, నిరాశ, నిస్పృహలు నిలువలేవన్న నిజం ఈ రెండేళ్ల ప్రయాణంలో నాకు అర్థమైంది. ఇది నటన కాదు.. నా రెండేళ్ల కష్టం. మారాలనే పట్టుదల ఫలితాన్ని రేపు తెరపై చూస్తారు' అని నమ్మకంగా చెప్పారు శర్వానంద్. ఏప్రిల్ 3న 'బైకర్' విడుదల కానున్న విషయం తెలిసిందే.

## పాట కోసం

# భాగ్యనగరంలో భారీ సెట్



తన గత చిత్రాలకు భిన్నంగా శరవేగంగా 'వారణాసి' చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 60శాతం పూర్తయింది. వచ్చే నెల తొలివారం నుంచి ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలు కానుంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాలపై ఓ పాటను ప్లాన్ చేశారు రాజమౌళి. ఈ పాట కోసం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఓ భారీ సెట్‌ని నిర్మిస్తున్నారు. ఈ సాంగ్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయని వినికిడి. భారతీయ పురాణ, ఇతిహాసాల నేపథ్యంలో సాగే ఈ సినిమా కథలో, అడ్వెంచర్లకు కొదవ ఉండదని, ట్రజర్ హంట్ కూడా ఈ కథలో కీలకమైన భాగమని ఇన్‌సైడ్ టాక్.

ఈ సినిమాలోని కొంతభాగం మహేశ్ శ్రీరామచంద్రుడిగా కనిపించనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన షూటింగ్‌ని కూడా రాజమౌళి పూర్తి చేశారు. 1300కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పాన్‌వరల్డ్ గ్లోబల్ అడ్వెంచర్‌ని రెండు భాగాలుగా విడుదల చేయాలనే ఆలోచనలో కూడా మేకర్స్ ఉన్నట్టు తెలిసింది. 2027 ఏప్రిల్ 7న విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రతినాయకునిగా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కథ: వి.విజయేంద్రప్రసాద్, మాటలు: దేవకట్టా, కెమెరా: పీఎస్ వినోద్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: కె.ఎల్.నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ, నిర్మాణం: శ్రీదుర్గా ఆర్ట్స్.

## రొమాంటిక్‌గా

# గూగుల్ మై ఫ్రెండ్




ప్రణవ్‌రావ్, రాణి, ప్రజక్త గైక్వాడ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న యువతరం సినిమా 'గూగుల్ మై ఫ్రెండ్'. గోవింద్ వరాహ దర్శకుడు. దివాకర్‌రెడ్డి నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా సాంగ్స్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, దర్శకులు వి.సముద్ర, శైలేష్ కొలను, కొండా విజయ్‌కుమార్, సాయిరాజేశ్ పాటలను ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. నిర్మాతల సహకారం వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చిందని, పాటలను ఆవిష్కరించిన తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలని దర్శకుడు గోవింద్ వరాహ అన్నారు. సియా రేవాడ్కర్, అశ్విని కులకర్ణి, మాధవ్ అభ్యంకర్, సి.దివాకర్‌రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిషన్ సాగర్, సంగీతం: ఎస్.సాగర్, కార్తీక్, లిరిక్ జాన్సన్, నిర్మాణం: డాలర్స్ మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్స్.

# స్పెషల్ సాంగ్‌లో ఫేమస్ సింగర్

## – ఈ 'చిచ్చుబుడ్డి' బ్యూటీ ఎవరో తెలుసా?



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన లేటెస్ట్ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ డెకాయిట్. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన గ్లింప్స్, టీజర్, సాంగ్స్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన స్పెషల్ సాంగ్ 'చిచ్చుబుడ్డి' యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది.అడివి శేష్ స్టెప్పులు వేయడం చాలా తక్కువ. ఐటం సాంగ్స్, మాస్ సాంగ్స్‌కు ఆమడ దూరంలో ఉండే ఆయన ఈ స్పెషల్ సాంగ్‌లో బ్యూటీతో కలిసి డ్యాన్స్ అదరగొట్టారు. ఈ వీడియోలో ఎనర్జీ స్టెప్పులతో ఊపేసిన బ్యూటీపై అందరి దృష్టి పడింది. నెట్టింట ఆమె గురించి తెగ సెర్చ్ చేస్తున్నారు. ఆ బ్యూటీ ఎవరో కాదు ఫేమస్ సింగర్ జోనితా గాంధీ.'భూమ్ భూమ్ భూమ్ భూమరాంగూ... ఎగరేస్తా పట్టుకోండి చీరకొంగు...' అనే లిరిక్స్‌తో సాంగ్ ప్రారంభం కాగా... ఈ పాటను జోనితా గాంధీనే పాడారు. ఇదే పాటలో అడివి శేష్‌తో స్టెప్పులు వేస్తూనే గాత్రం అందించారు. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా... రామ్ మిరియాల, జోనితా గాంధీ పాడారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందించారు. దేశ రాజధాని ఢిల్లీలో జోనితా గాంధీ పుట్టగా... ఆమెకు 9 నెలల వయసున్నప్పుడే ఆమె కుటుంబం టొరంటోకి వెళ్లిపోయారు. ఏడేళ్ల వయసు నుంచే మ్యూజిక్‌పై ఇష్టంతో పాటలు పాడేవారు.

ఆ తర్వాత అలా సాధన చేస్తూ తన మ్యూజిక్ ఆల్బమ్స్ యూట్యూబ్‌లో పెట్టేవారు. వాటికి మంచి రెస్పాన్స్ రావడంతో ఆమె అడుగులు సింగింగ్ వైపు పడ్డాయి. అది కెరీర్‌గా మలుచుకునేందుకు తిరిగి భారత్ వచ్చారు జోనితా. ఆమె అప్పటికే చేసిన మ్యూజిక్ ఆల్బమ్స్ మ్యూజిక్ డైరెక్టర్స్‌ను ఆకట్టుకున్నాయి. అలా, బాలీవుడ్ మూవీ షారుఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్ ప్రెస్'లో పాట పాడే ఛాన్స్ దక్కింది. ఆ పాటను ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంతో కలిసి పాడడంతో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. అలా జోనితాకు వరుస అవకాశాలు దక్కాయి. ఏఆర్ రెహమాన్, అమిత్ త్రివేది, ప్రీతమ్ వంటి వారు మ్యూజిక్ అందించిన సినిమాల్లో వరుసగా పాటలు పాడి మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. జోనితా గాంధీ తెలుగులోనూ పాటలు పాడారు. ఓకే బంగారం సినిమాలో మెంటల్ మదిలో, బీస్ట్ మూవీలో హలమతీ హబీబో, కిక్ 2లో నువ్వే నువ్వే ప్రాణం, లవ్ స్టోరీ సినిమాలో ఏవో ఏవో కలలే, సర్కారు వారి పాట మూవీలో మ మ మహేశా పాట పాడి మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. హిందీతో పాటు కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లోనూ పాటలు పాడారు.

ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె... తన పాటల వివరాలు, ఫోటోలు, లైవ్ కాన్సెర్ట్స్ వివరాలు అభిమానులతో షేర్ చేసుకుంటుంటారు. తమిళ మూవీ వాకింగ్ టాకింగ్ స్ట్రాబెర్రీ ఐస్ క్రీమ్‌లోనూ నటించారు. తాజాగా డెకాయిట్‌లో సింగర్‌గా మాత్రమే కాకుండా డ్యాన్సర్‌గానూ అదరగొట్టారు. షానిల్ డియో దర్శకత్వం వహించిన ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154